# కుంటోడి కథ

వాడు రోజూ కన్పిస్తాడు. ఎంతగానో రోదిస్తాడు. హృదయం కరిగేలా అనుకుంటాడు. ఏమిటో ఆలోచిస్తాడు. తనలో తనే నవ్వుకుంటాడు. ఆ నవ్వులో జీవం ఉండదు—చీకటిలాటి నవ్వది.

ఎదుటివాడి కలిమికి ఏడవనివాడూ, తనలోపాన్ని వేలెత్తి చూపిస్తూ వెకిలిగా నవ్వేవాళ్ళను సహితం నిందించనివాడూ, తనకీ దుస్థితి కల్పించినవాళ్ళను తిట్టనివాడూ కూడా వాడే!

తనలాటి అనాథకుల్నీ, బ్రతుకు లేని వాళ్ళనూ చూచి 'అయ్యోపాపం' అనగల్గిన జాలిగుండె వాడిది.

కలిగినవాళ్ళు కానీ వేసే (వెయ్యక పోయినా) చెయ్యెత్తి దణ్ణం పెడతాడు; తిట్లకూ, చివాట్లకూ—కసిరికీ, కాలితన్నానికి కూడా వాడు జోలె పడతాడు.

'సొట్టవెధవ'...'కుంటిపీనుగ'—పెద్దవాళ్ళు ఇచ్చిన బిరుదు లవి.

అలా పిల్చినా పలుకుతాడు—చిన్నబుచ్చుకోడు—కోపం తెచ్చుకోడు కాని, ఒంటరిగా కూర్చున్నప్పు డవన్నీ తల్చుకునేమో ఏడుస్తాడు—తన స్థితికికాదు—ఎదుటివారికా భగవంతు డెందుకు 'సహృదయాన్నివ్వలేదా' అని బాధ పడతాడు. ఆ బాధలోనే యెంతగానో యేడుస్తాడు.

వాడికి తెగించి పైసా ధర్మం చెయ్యక్కర్లేదు—కరుణకలిగి కుంచెడు బియ్యం గుమ్మరించక్కర్లేదు—వాడివేపు సానుభూతితో, దయతో, చూస్తేచాలు అదే పదివేలు—అదే వాడి ఆకలిని తీర్చేది—వాడి కానందాన్ని కలిగించేది. వాడు 'సంతృప్తి'తో కడుపు నింపుకుంటాడు.

'దయ' వాడు కప్పుకొనే దుప్పటి. 'కనికరం' వాడికి పట్టుపరుపు. 'చేయూత' అదే వాడి ఐశ్వర్యం.

కర్రల్నానుకొని నడుస్తాడు వాడు. కుర్రకారులు ఏడిపించటానికి కర్రల్లాగేస్తూంటారు. వాడు నవ్వుతాడు. వాళ్ళని, వాళ్ళ అల్లరిని చూసి సంబరపడతాడు. కొందరి నిస్సహాయస్థితికి జాలిపడతాడు.

రాచకొండ రంగనాథశాస్త్రి

అలాటప్పుడు కూడా ఒక్కోసారి ఒంటరితనం కోరుకుంటాడు. అదిలభించగానే వలవల యేడ్చేస్తాడు. కారణం? గతజ్ఞాపకాలో? అర్థంకాని పరమాత్ముని లీలలో? ఏమోమరి.

వయస్సు ముప్పయ్యుండొచ్చు కాని- ఏభయ్యోపడిలో పడ్డవాడిలా ఉంటాడు- ఎర్రగా ఉంటాడు - ఎత్తుగా ఉంటాడు - ఎండుగడ్డి లాటి జుత్తు - ఎబ్బెట్టుగా కన్పించని ముఖం. ఆ ముఖంలో సవాలక్ష జీవితానుభవాలు జీర్ణించకపోయినా లక్షణాలు స్పష్టంగా - అతిస్పష్టంగా కన్పిస్తాయి.

వాణ్ణి చూస్తే జాలి కలుగుతుంది - సానుభూతివాక్యాలు పలకా లనిపిస్తుంది. చేతనైన ధనసహాయం చేయగల తాహతు నా కున్నప్పటికీ ఆ ఊహ నా కెప్పుడూ రాలేదు. వాడితో మాట్లాడటానికే నా కెందుకో భీతి కలుగుతుంది - నల్గురూ ఏమైనా అనుకుంటారేమో ననే భయం నాలాటి ధనవంతుడికి - హోదా ఉన్నవాడికి అలాటివాడితో నిలబడి మాట్లాడ్డం కూడ దనిపిస్తోంది. లోకాన్ని లెక్కజేయాల్సిన అవసరం నాకు లేదు నిజానికి - ఐతేనేం? పదిమంది నన్ను చూసి నవ్వుతారనే పిరికితనం - అది నా చేతగానితనం అనండి - అహం అనండి - ఏమైనాసరే - యిప్పటి నా స్థితికి అలాటివాడితో నన్ను మాట్లాడనీయదు అయినా...

వాణ్ణి చీదరించుకునేవాళ్ళను చూస్తే నా కసహ్యం కలిగేది - వాణ్ణి నానా మాటలూ అనేవాళ్ళను చూస్తే బాధ కలిగేది - కాని అది వ్యక్తం చేయలేని అవివేకణ్ణి నేను. పిరికివాణ్ణి.

వాడి చూపు లొక్కోసారి నన్ను కాల్చివేసేవి - స్థంభింపజేసేవి. అవి అగ్నిశిఖలు కావు. కత్తిపోట్లు కావు. విద్యుద్ఘాతం అంతకంటె కాదు

మమత - ఆప్యాయత - అనురాగం లాటి ఎన్నో అతి సున్నిత భావాల అనంతరూపం ఆ చూపుల్లో గోచరించేది. తట్టుకోలేక నన్ను నేనే తిట్టుకునేవాణ్ణి: యెందుకింత ఎటూ పనికిరాని హృదయాన్నిచ్చాడా భగవంతుడు నా కని

మా యింటి కెదురుగా పది పదిహేను గజాలదూరంలో రోడ్డు కవతలగా - రాలిపోతూ - రాలిపోతూన్న పూరి పాకలో వాడి నివాసం. ఆ పాక వాడి ఆస్థికాదు ... దిక్కుమాలినవాళ్ళు-తల దాచుకోవటంకోసం. ఇదివరలో ఏ పుణ్యాత్ముడో అక్కడ పాక వేయిస్తే - చన్నీళ్ళు పోసుకోలేని కొంతమంది మోతుబర్లు నీళ్ళు కాచుకోడానికి పట్టుకుపోయిన 'కమ్మలు' పోగా - యిప్పుడున్నవి వేళ్ళమీద లెక్కపెట్టవచ్చు ఆ పాకలో వాడిలాటివాళ్ళెవరయినా నివాసం ఉండొచ్చు - యింకా...

వానలో తడవటాని కిష్టంలేనివాళ్ళు- ఎండలో ఎండిపోతామని భయపడే




వాళ్ళు — ఆ పాకలో దూరి విశ్రాంతగా తడవ్వచ్చు. నిర్భయంగా ఎండవచ్చు.

సూర్యచంద్రుల ఆశీస్సులు — తారల పలకరింపులు అందులో వాళ్ళకే లభ్యమౌతాయ్

ఉదయం నేను బయట కొచ్చేసరికి వాడు కన్పిస్తాడు. ఆలోచిస్తూనో — ఆనందిస్తూనో — ఆడుకుంటూనో దణ్ణం పెడతాడు — నోటితో అంటాడు.

చూడనట్టు — విన్పించుకోనట్టు వెళ్ళిపోతాను— వెనుదిరిగి చూడా లనిపిస్తుంది. నా ఆస్థీ — అంతస్థూ — హోదాలూ — అడ్డువస్తాయ్. వాడి జాలిగొలిపే కంఠం నాలో ఏదో తెలియనిబాధనూ —వ్యధనూ రేకెత్తిస్తుంది. కాని నా అహంముం దది దూదిపింజలా ఎగిరిపోతుంది.

ఆ రోజు ...

చిన్నగా వానజల్లు ప్రారంభమయింది. మేఘాలు 'స్వార్థం'లా అంతటా అల్లుకున్నాయ్. ఆకాశంలో. వానజల్లులో తడుస్తూ — గోల చేస్తూ — పాటలు పాడుతూ — గుంపులు గుంపులుగా — జట్లుజట్లుగా వస్తున్న బడిపిల్లల్ని చూసేసరికి అకస్మాత్తుగా మా అమ్మాయి 'విజయ' జ్ఞాపకం వచ్చింది.

కారును ఆపాను. యెవరో కుర్రాళ్లు కారుచుట్టూ మూగారు. అందులో ఒకా డన్నాడు — 'మీ విజయ యింటి కెళ్ళిపోయింది సార్.'

కారు స్టార్ట్ చేసియింటివైపువోనిచ్చాను. వర్షం జోరుతోపాటు నా కారు జోరు హెచ్చింది. అంత స్పీడులోనూ సందు మలుపు తిరుగుతోంది నా కారు. 'అమ్మా' గావుకేక

కారు సడెన్‌గా ఆగిపోయింది. రోడ్డు ప్రక్కగా తూలిపడిన 'విజయ' వణవణ వణికిపోతూంది. కారు క్రిందనుంచి సన్నని మూలుగు — వాడు — వాడిదే ఆ మూలుగు. కారు దిగాను — విజయ వణుకుతూ వచ్చి నన్ను గట్టిగా కౌగలించు కుంది.

"ఆ కుంటాడు — మరే, నన్ను తోసీ వోఁలే — నీ కారుకింద పడుదును నాన్నా — మరే, కుంటాడు మంచాడు నాన్నా — నాకు దాక్కెట్టు ...

'విజయా' వినలేకపోయాను. నా గుండెల్నెవరో బలంగా పిండి వేసిన ట్లయింది. నా కూతుర్ని వాడు రక్షించాడు.

హోదా — దర్జా — ఐశ్వర్యం — గర్వం — యివి నా కారుచక్రాలు. వాటి క్రింద మానవత్వం పడి దుర్మరణం పొందింది మూలుగు వినిపించలేదు — రక్తం మడుగులో వాడి శవం — వాన నీరుతో కలిసి రక్తం కాలువలా ప్రవహిస్తోంది.

అంతిదూరంలో వాడి కర్రలు తూలి పోయాయి. వాడి చావు దశవరకూ సహాయపడ్డవి. సానుభూతి చూపినవి ఆ జీవంలేని కర్రలు మాత్రమే — తప్ప హృదయం ఉన్న మానవు డెన్నడూ తెగించి త్యాగం చేయలేకపోయాడు.

బుర్ర చిట్లిపోయింది — ఆ భయంకర దృశ్యాన్ని చూడలేక పోయాను. అదే స్థలంలో మా అమ్మాయి 'విజయ'ను ఊహించుకున్నాను ... తల తిరిగినట్లయింది. అలాగే కారుకు ఆనుకుని పోయాను. ఆ తరువాత అందరిలాగే వాడూ మట్టిలో కల్సిపోయాడు.

నా హోదా — ఐశ్వర్యం ఒకళ్ళను బ్రతిగించడానికి అవసరపడలేదు — ఒకడి జీవితాన్ని పొట్ట బెట్టుకుంది — వాడు కుంటివాడని — అవిటివాడని — ఏ ఒక్కనాడూ ప్రత్యక్షంగా సానుభూతి చూపలేని పిరికివాణ్ణి నేను. ఒక వ్యక్తి జీవితాన్ని నిలబెట్టలేని నా అసమర్థతకూ — అదే వ్యక్తి మరొకరి జీవితాన్ని (అందులోనూ నా కయినవాళ్ళ జీవితాన్ని) నిలబెట్టటం కోసం త్యాగం చేసిన సంస్కారానికీ ఉన్న విచక్షణ, ఒక్క పిడికెడు హృదయం లేనిదే అయినా — కొలత కందని తారతమ్యం అది — అంతు పట్టని దూరం అది. ఆత్మ సౌందర్యం లేని యీ పైపై మెఱుగుల అందం హోదా — దర్జా — ఎందుకోసం?

మా యిద్దరికీ ఉన్న తేడా ఒక్కటే. వాడు భౌతికంగా కుంటివాడు; నేను మానసికంగా కుంటివాణ్ణి.

---